క్లుప్తంగా

గోరుముద్ద కార్యక్రమం ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిందం కళ

సిరిసిల్లఅర్బన్: స్థానిక వెంకంపేట జెడ్పీహెచ్ఎస్‌లో గోరు ముద్ద కార్యక్రమాన్ని సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు కౌన్సిలర్ కల్లూరి రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి,ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ వీరబత్తిని కమలాకర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన



హోటల్ యజమానికి తెలియజేస్తున్న సీఆర్పీలు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చింతాల్‌ఠాణా, ఆరెపల్లి, సంకెపల్లి గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు సీఆర్పీలు ఆకుల శ్రీనివాస్, నగేశ్ గ్రామాల్లో సందర్శించి పారిశుధ్యం, ప్లాస్టిక్ నియంత్రణపై గ్రామపంచాయతీ సిబ్బందికి తగు సూచనలు చేశారు. అలాగే గ్రామాల్లోని హోటళ్లు, దుకాణాల్లో ప్లాస్టిక్‌ను నియంత్రించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన తంగళ్లపల్లి నాయకులు



మంత్రి కేటీఆర్‌తో తంగళ్లపల్లి నాయకులు

తంగళ్లపల్లి: మండలానికి చెందిన పలువురు నాయకులు సోమవారం మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పడిగెల రాజు, బుస్స లింగం, ముస్తాబాద్ గోపాలరావు పాల్గొన్నారు.

ఆలయానికి కమాన్ ఏర్పాటు

కోనరావుపేట: మండలంలోని గొల్లపల్లి వట్టిమల్ల గ్రామాల మధ్య గల శివసాయి ఆలయంలో నూతనంగా నిర్మించిన కమాన్‌ను సర్పంచులు గోపు పర్శయ్య, కొమ్ము స్వప్న సోమవారం ప్రారంభించారు. మాలేసియాలో పనిచేస్తున్న గ్రామానికి చెందిన ఎన్నారై నూనె రాజేందర్ రూ.1.70 లక్షలు వెచ్చించి ఆలయానికి కమాన్ నిర్మించారు.

తీరని సమస్యలు

వేములవాడఅర్బన్: బోయినపల్లి మండలం మన్వాద వద్ద 2006లో మధ్య మానేరు ప్రాజెక్ట్‌ను జలయజ్ఞంలో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో కొదురుపాక, శాభాష్‌పల్లి, నీలోజిపల్లి, వర్దవెల్లి, రుద్రవరం, సంకెపల్లి, కొడుముంజ, అనుపురం, చీర్లవంచ, చింతాల్‌ఠాణా, కందికట్కూర్, గుర్రవానిపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వం అప్పటి గెజిట్ ప్రకారం 11,750 కుటుంబాలు ముంపునకు గురవుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఆ గ్రామాలకు ఆర్ అండ్‌ఆర్ కాలనీలు ఏర్పాటు చేసి నిర్వాసితులకు ప్లాట్లు కేటాయించారు. జలయజ్ఞం కోసం ఉన్న ఊరును వదిలి ప్రభుత్వం కేటాయించిన కాలనీల్లో నివాసముంటున్న ప్రజలను ఇప్పటికీ ఎన్నో సమస్యలు పట్టిపీడిస్తునే ఉన్నాయి. కాలనీల్లో అన్ని వసతుల కల్పనకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.


- పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు కరువు
- మూడు గ్రామాల్లో అవే సమస్యలు
- ఇబ్బందిపడుతున్న కాలనీవాసులు
- పట్టించుకోని ప్రభుత్వం

సంకెపల్లి కాలనీలో..

➡ ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ లేదు
➡ బ్యాక్ వాటర్ అనుకుని రావడంతో శ్మశాన వాటిక, డంపింగ్ యార్డు నిరుపయోగంగా మారాయి
➡ గ్రామ దేవతలు, శ్రీహనుమాన్, బద్ది పోచమ్మ, శివాలయాలకు నిధులు, స్థలం కేటాయించలేదు
➡ పల్లె ప్రకృతి వనం నామమాత్రంగా ఉంది ఎలాంటి అభివృద్ధి లేదు
➡ కమ్యూనిటీ భవనాలు మచ్చుకైనా కానరావు
➡ మహిళ సంఘం భవనం ఊసే లేదు
➡ గౌడ కులస్తులకు గిరిక తాళ్లు, ఈత వనం కనిపించదు
➡ యువతకు ఉపాధి కరువైంది

కొడుముంజ కాలనీలో..

➡ శ్మశానవాటికకు దారిలేక నిరుపయోగంగా ఉంది.
➡ పాత గ్రామంలోనే అంత్యక్రియలు చేస్తున్నారు. దీంతో బ్యాక్ వాటర్ వస్తే ఇబ్బందే.
➡ గ్రామంలో కమ్యూనిటీ భవనాలు లేవు,
➡ గ్రామపంచాయతీకి ప్రహరీ నిర్మించలేదు.
➡ గౌడ కులస్తులకు ఉపాధి లేదు. గిరిక తాళ్లు, ఈతవనం లేదు.



కొడుముంజ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ



శాభాష్‌పల్లి కాలనీలో ఆగిన ఆలయాల నిర్మాణాలు



కొడుముంజలో నిరుపయోగంగా శ్మశానవాటిక

శాభాష్‌పల్లిలో..

➡ శాభాష్‌పల్లికి మంజూరు చేసిన రెండు శ్రీ హనుమాన్ దేవాలయాల నిర్మాణాలు ప్రభుత్వం కేటాయించిన రూ.15 లక్షలు సరిపడక అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇంక రూ.15 లక్షలు కేటాయించాలని కాలనీవాసులు కోరారు. - పాఠశాల గదుల ముందు ఫ్లోరింగ్ గుంతలు పడింది. వెంటనే మరమ్మత్తులు చేయాల్సి ఉంది.
➡ గ్రామపంచాయతీ భవనానికి నిధులు మంజూరు చేసినా, పనులు మాత్రం ప్రారంభించ లేదు.
➡ కమ్యూనిటీ భవనం నిర్మాణం పనులు పూర్తి కాలేదు.

శ్మశానవాటికకు దారేది



కొడుముంజ గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో శ్మశానవాటిక నిర్మించారు. కాని అక్కడికి వెళ్లడానికి దారిలేదు. నిర్మించినప్పటి నుంచి నిరుపయోగంగా ఉంది. అక్కడి వరకు రోడ్డు నిర్మించాలి.
– కదారి శంకరయ్య, కొడుముంజ

గౌడన్నలకు ఉపాధి లేదు



పాత గ్రామంలో తాటి, ఈత కల్లుతో ఉపాధి దొరికింది. ఇక్కడికి వచ్చాక ఉపాధి లేదు. దీంతో గౌడన్నలకు కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం గిరిక తాళ్లు, ఈత వనం ఏర్పాటు చేసి ఇవ్వాలి.
– బాలసాని దేవయ్యగౌడ్, కొడుముంజ

నిరుపయోగంగా శ్మశానవాటిక



సంకెపల్లిలో నిర్మించిన శ్మశానవాటిక వద్దకు మిడ్ మానేరు బ్యాక్‌వాటర్ రావడంతో నిరుపయోగంగా మారింది. దీంతో ఎవరు మృతి చెందిన పాత గ్రామంలోనే అంత్యక్రియలు చేస్తున్నారు. పాత గ్రామంలో ఏర్పాటు చేయాలి.
– నాగుల సురేశ్, సంకెపల్లి

ఆలయాలు నిర్మించాలి



సంకెపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో దేవాలయాలకు ప్రభుత్వం స్థలం కేటాయించలేదు. అధికారులు పట్టించుకుని ఆలయాలకు స్థలం కేటాయించి, నిర్మాణానికి నిధులు మాంజూరు చేయాలి.
– కాచం నిఖిల్, సంకెపల్లి

సమాచారం

నేడు మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు

సిరిసిల్లఅర్బన్: రాజన్న ప్రీమియర్ లీగ్ కబడ్డీ, వాలీబాల్ మండల స్థాయి క్రీడా పోటీలను సిరిసిల్ల పట్టణం రాజీవ్‌నగర్‌లోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల పైబడిన మహిళలు, పురుషులు ఉదయం 10 గంటలలోపు హాజరుకావాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన కబడ్డీ, వాలీబాల్ జట్లను ఈనెల 8, 9వ తేదీల్లో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

10న మండల సర్వసభ్య సమావేశం

వీర్నపల్లి: మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ మాలోత్ భూల అధ్యక్షతన ఈ నెల 10న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నరేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సకాలంలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో అభివృద్ధి పనులు, సమస్యలపై శాఖల వారీగా చర్చించడం జరుగుతుందన్నారు.

నియామకం

కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా దూది శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, జెడ్పీటీసీ నాగం కుమార్ తెలిపారు. సర్పంచ్ నేతికుంట జలపతి, కాంగ్రెస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

సెస్ గ్రామ ప్రతినిధులు వీరే

ముస్తాబాద్: నామాపూర్ సెస్ ప్రతినిధులుగా జూకంటి సుధాకర్‌రావు, తాడెపు రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పోతుగల్ ప్రతినిధులుగా వీర్ల అంజయ్య, బొబ్బిలి హనుమంతు ఎన్నికయ్యారు.
ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల గ్రామ సెస్ ప్రతినిధులుగా కట్ట నర్సింహారెడ్డి, చల్ల లక్ష్మారెడ్డి ఎన్నికయినట్లు సెస్ గ్రామ ఎన్నికల అధికారి సద్దాం తెలిపారు.
వేములవాడరూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామంలో సర్పంచ్ సామ కవిత ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన గొల్లపల్లి రాజు, సామ మోహన్‌రెడ్డిని సెస్ ప్రతినిధులుగా ఎన్నుకున్నారు.
తంగళ్లపల్లి: మండలంలోని వేణుగోపాలపూర్ గ్రామం సెస్ ప్రతినిధులుగా సాగర్ రెడ్డి, తిరుపతి రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి, బాబాయిచెరువు సెస్ గ్రామ ప్రతినిధులుగా పెంట మల్లేశం, ఈసంపల్లి రాజ మల్లయ్య, భూక్య మదన్ ను ఎన్నుకున్నట్లు సెస్ ఎన్నికల అధికారి బోయిని లావణ్య తెలిపారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.
చందుర్తి: మండలం కిష్టంపేట గ్రామ సెస్ ప్రతినిధులుగా కేశవేణి రాజు, ఉగిలే శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. వీరిని గ్రామ సర్పంచ్ అంబరి కల్పన, ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, రైతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సెస్ ఏఈ స్రవంతి, సెస్ సిబ్బంది పాల్గొన్నారు.
కోనరావుపేట: మండలం నిజామాబాద్‌లో సెస్ ప్రతినిధులుగా గుండ తిరుపతిగౌడ్, ఎస్. శ్రీనివాస్ ఎన్నికయ్యారని సర్పంచ్ కేతిరెడ్డి అరుణ తెలిపారు. బావుసాయిపేటలో చిగుర్ల దేవయ్య, బైరగోని మల్లయ్యను ఎన్నుకున్నట్లు సర్పంచ్ గంగాధర్ తెలిపారు.

హాథ్‌సే హాథ్ జోడో



తంగళ్లపల్లిలో హాత్ సే హాత్ జోడో పాదయాత్ర ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు



సిరిసిల్లటౌన్: కరపత్రాల పంపిణీ



గంభీరావుపేట: పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

జిల్లాలోని మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో హాత్‌సే హాత్ జోడో కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద సోమవారం కరపత్రాన్ని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే కాంగ్రెస్ హాత్‌సే హాత్ జోడో యాత్ర చేపడుతోందని అన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, జిల్లా కార్యదర్శి లింగం గౌడ్, గిరిధర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజు నాయక్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, జలగం ప్రవీణ్, వకుళాభరణం శ్రీనివాస్, యెల్ల బాల్‌రెడ్డి, పిల్లి కనుకయ్య, షేక్ ఫిరోజ్‌పాషా, దొమ్మాటి నర్సయ్య పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

ఆత్మ రక్షణకు కరాటే శిక్షణ



ముస్తాబాద్: ఆవునూర్‌లో శిక్షణలో బాలికలు

ముస్తాబాద్: సమగ్ర శిక్ష అభియాన్‌లో భాగంగా ఆత్మ రక్షణ కోసం బాలికలకు విద్యాశాఖ కరాటే శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మండలంలోని ఆవునూర్ జెడ్పీహెచ్ఎస్‌లో రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్ కార్యక్రమాన్ని హెచ్ఎం భూక్యరాజు, మార్షల్ ఆర్ట్స్ ట్రైనర్ రామకృష్ణ ప్రారంభించారు. బాలికలకు కరాటే, నాంచాక్ వంటి వాటిపై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. పీఈటీ సురేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
గంభీరావుపేట: మండలం దమ్మన్నపేట పాఠశాలలో శిక్షకులు బుచ్చిబాబు విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోయన్నగారి నారాయణ శిక్షణ తరగతులను పర్యవేక్షించారు.
ఎల్లారెడ్డిపేట: మండలం వెంకటాపూర్‌లో విద్యార్థినులకు కరాటే శిక్షణ ప్రారంభమైంది. జెండర్ అండర్ ఈక్విటీ కో ఆర్డినేటర్ పద్మజ శిక్షణ తరగతులను పరిశీలించారు. ఆమె వెంట కరాటే మాస్టర్ ఓరుగంటి రామకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్, ఉపాధ్యాయులు ఉన్నారు.
తంగళ్లపల్లి: మండలం మండెపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం కరాటే మెలుకువలను నేర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సజ్జనం శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు స్వీయ రక్షణలో భాగంగా కరాటే మాస్టర్ సుజీవన్‌తో సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బీఎస్పీ కోటి సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

బోయినపల్లి: స్థానిక బస్టాండ్ ప్రాంతంలో సోమవారం బీఎస్పీ మండల కమిటీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఇన్‌చార్జిలు కొంకటి శేఖర్, మంద రవీందర్ మాట్లాడుతూ బీసీ జనగణన చేయాలని రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు 27 శాతం నుంచి 52 శాతం వరకు పెంచాలని కోరారు. బీసీలకు రాజ్యాధికారం బీఎస్పీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ అధ్యక్షుడు మాంకాళి తిరుపతి, మండల అధ్యక్షుడు అలువాల అజయ్, ఎండీ. షమీమ్, ఇల్లెందుల అరుణ్, బొడ్డు రాజలింగంబాబు, పెగ్గెర్ల మహేందర్, ఈశ్వర్, తేజ పాల్గొన్నారు.

శిథిలావస్థలో భవనాలు



శిథిలావస్థకు చేరిన ఇరిగేషన్ పాత గెస్ట్ హౌస్

- ఎప్పుడు కూలుతాయోనని ఆందోళన
- కూల్చివేతకు మీనమేషాలు లెక్కిస్తున్న వైనం

గంభీరావుపేట: ప్రభుత్వ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నా పట్టించుకున్నవారు లేరు. జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఉన్న ఈ పాత భవనాలు ఎప్పుడు కూలి ఏం ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ భవనాలను పూర్తిగా కూల్చివేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
➡ ఇరిగేషన్‌శాఖ పరిధిలోని ఓల్డ్ గెస్ట్‌హౌస్‌లో చాలా ఏళ్లుగా రెవెన్యూ కార్యాలయం నిర్వహించారు. దానికి అనుబంధంగా వెనుక భాగంలో ఉన్న పెంకుటిళ్లలోని గదుల్లోనూ కార్యాలయాన్ని నిర్వహించారు. భవనం, గదులు శిథిలావస్థకు చేరాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి.
➡ రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాలకు ఆధునిక వసతులతో కూడిన కొత్త భవనాలు నిర్మించి, కార్యాలయాల నిర్వహిస్తున్నారు.
➡ మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు సమీపంలో క్యాంప్ ఏరియాలో ఇరిగేషన్ శాఖ నిర్మించిన ఓ భవనాన్ని ఆ శాఖ పరిధిలో వివిధ పనులకు వినియోగించారు. కాలక్రమంలో ఈ భవనం శిథిలావస్థకు చేరి, నిరుపయోగంగా మారింది.
➡ స్థానిక సెస్ వినియోగదారుల సేవా కేంద్రం శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో ఈ కార్యాలయంలోకి అడుగుపెట్టేందుకు వీలులేకుండా ఉంటుంది. అయినా ప్రస్తుతం కార్యాలయం అక్కడే కొనసాగుతోంది. కొత్త భవనాన్ని నిర్మించాలని వినియోగదారులు కోరుతున్నారు.

పాత భవనాలు తొలగించాలి



కూలేందుకు సిద్ధంగా ఉన్న ఈ భవనాల వద్దే ప్రజలు సేదతీరుతారు. ఎప్పుడు కూలుతాయో తెలియని వీటి వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరుగకముందే కూల్చివేసి చదును చేయాలి.
– గంట అశోక్, గంభీరావుపేట

కొత్త వాటికి ప్రతిపాదనలు



శిథిలావస్థకు చేరిన భవనంలో సెస్ కార్యాలయ నిర్వహణ ఇబ్బందిగా ఉంది. కొత్త భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించారు. మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తాం.
– నారాయణరావు, సెస్ డైరెక్టర్, గంభీరావుపేట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



పాత భవనాలను తొలగించే విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. త్వరలోనే దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి తగు చర్యలు తీసుకుంటాం.
– కొమిరిశెట్టి విజయ, జెడ్పీటీసీ, గంభీరావుపేట



కుంగుతున్న బావి

ఈ బావి తంగళ్లపల్లి మండలం తాడూరు గ్రామ పరిధిలో ఉంది. దశాబ్దాలుగా సమీపంలోని వ్యవసాయ పొలాలకు సాగు నీరు అందిస్తూ పదిహేను కుటుంబాల మనుగడకు ఆధారంగా నిలిచింది. ఇటీవల కొంత కాలంగా ఈ బావి క్రమంగా భూమిలోకి కుంగిపోవడం రైతులు గమనించారు. ఎందుకు కుంగుతుందో అంతుపట్టకుండా ఉందని, ఏళ్ల తరబడి తమ పొలాలకు సాగునీటిని అందిస్తున్న బావి కుంగిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తమకు ప్రత్యామ్నాయ నీటి వనరులను గానీ నష్టపరిహారాన్ని కోరుతూ అధికారులకు విన్నవించుకుంటున్నారు. – సిరిసిల్ల కల్చరల్

రైతులకు పరిహారం అందించాలని వినతి

ఇల్లంతకుంట: మండలంలోని సిరికొండ గ్రామ పెద్ద చెరువులో రెండు వందల ఎకరాల వ్యవసాయ భూమి ముంపునకు గురవుతోందని, కలెక్టర్ స్పందించి రైతులకు 15 రోజుల్లో నష్ట పరిహారం అందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగూ గ్రామానికి తాగునీరు అందించే మంచినీళ్ల బావి కూడా చెరువులో మునిగిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలని కోరారు.

బీరప్ప కామరాతి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో శ్రీకృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో బీరయ్య-కామరాతి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీజేపీ జిల్లా నాయకులు గోపాడి సురేందర్‌రావు, గొట్టె రామచంద్రం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్య, సంకినేని రాంమోహన్ రావు , వైస్‌చైర్మన్ కాశవేణి మహేశ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మిరాల భాస్కర్‌యాదవ్, యాదవ సంఘం బాధ్యులు వీరవేణి దేవేందర్,

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899